# మనం - మనదేవాలయాలు

*- యేలూరిపాటి ఆంజనేయశర్మ*

"ఇంటికంటే గుడి పదిలం" అన్న సామెత మనమందరం ఎరిగున్నదే. అది సామెత మాత్రమే కాదు, నిజం కూడా. నేటికీ ప్రకృతి వైపరీత్యాలొచ్చినప్పుడు జనసామాన్యానికి నిలువనీడనిచ్చేవి బళ్ళు-గుళ్ళే.

మనదేశంలోని ప్రతిపల్లెలోనూ మిట్ట మధ్యాహ్ననికి మహానైవేద్యాన్ని సిద్ధంచేసి నివేదనచేసి, ఆ ప్రసాదాన్ని అందరికీ పంచటంకోసం, రండి! అంటూ భక్తుల్ని ఆహ్వానిస్తూ పెద్దగంటను మోగించేవారు అర్చకులు. ఆ ఘంటానాదంతో ఎక్కడో ఉన్నప్పటికీ విని వచ్చి ప్రసాదాన్ని స్వీకరించేవారు. ఇకదానితో ఆ ఊళ్ళో అన్నార్తుడు మిగిలేవాడుకాదు. ఏయింటా ఆతిథ్యం లభించని బాటసారులు, యాత్రికులు మాత్రమేకాదు, పనిచేసుకోలేని వృద్ధులు, ఉపాధిదొరకనివారు- అందరికీ ఆ ప్రసాదమే కూలంబన అయ్యేది. ఈ వ్యవస్థ నడవడానికై రాజులు-తరువాతి కాలంలో దాతలు అగ్రహారాలను, మాన్యాలను దానాలుగా ఇచ్చేవారు.

కాశీరామేశ్వరాలను కాలినడకన చూసే యాత్రికులకు ఎండవేళ-రాత్రిపూట విశ్రమించటానికి గుడిగోపురం అరుగులే ఆధారమయ్యేవి. గుడి గోపురంపై ఉన్న కలశాలు లోహనిర్మితాలు. పిడుగులు పడినపుడు విద్యుత్తును ఆకర్షించి భూమిలోనికి విలీనం చేస్తూ ఊళ్ళోని మరేయింటికి ఆపద వాటిల్లకుండా చూసేవి. గుడిగోపురంకంటే ఎత్తుగా గృహనిర్మాణం చేసికోరాదని వాస్తు నియమం! గుడినీడ ఇంటిపై పడరాదనటానికి కారణం, సమూహానికి అవసరమైన గుడిచుట్టూ తగినంత స్థలం మిగిల్చటానికి ఇల్లు గుడికి వీలైనంత దూరంగా నిర్మించుకోమని సలహా కావచ్చు.

గుడి, కోవెల, కోఇల్, కూలయం ఇలా ఎన్నో పేర్లతో వ్యవహరించబడుతున్న గుడి దేవుడుండే చోటు- దేవస్థానం-దేవాలయం.

అంతటా దేవుడున్నాడు, పిపీలికాది బ్రహ్మపర్యంతం అంతారామమయం, సర్వం ఖల్విదంబ్రహ్మ, సర్వం విష్ణుమయంజగత్ అంటూ ఎన్నోచెప్పుకునే మనకి అక్కడే-ఆలయంలోనే దేవుడున్నాడనేది వైరుధ్యం కాదా? కాదు వైవిధ్యం.

ఆదినుండీ మానవుడు తనపరిధిలో లేని పరిష్కారాలకు 'భగవంతునిదే భారం' అనుకొంటూ, తన శక్తికి మించిన వ్యవహారాలకు అనంత శక్తివంతమైన భగవచ్ఛక్తిని నమ్ముకున్నాడు. వ్యక్తిగతమైన ఉపాసనకు - పూజా పునస్కారాలకు ఇలవేల్పులుంటే, సమూహానికి చెందిన పూజలకు సేవలకు కూలౌ స్థితుడైన భగవంతుడు ఆలంబన అవుతున్నాడు. అనంత శక్తి స్వరూపుడైన భగవంతుని శక్తిని మన శక్తిమేరకు కేంద్రీకరింపజేసికొని లబ్ధి పొందటమే ఆలయవ్యవస్థ.

మనం నిర్మించుకున్న దేవుడేకదా మనకు వరాలివ్వగలడా? అనిపించవచ్చు. మనం వెలిగించుకున్న దీపమే మనకు దారిచూపటంలేదా? ఇదీ అంతే. అనంతమైన ప్రాకృతికశక్తి సమీకరణమే ఆలయదైవం.

నిజానికి ఆలయాల ప్రస్తావన వేదకాలంలో లేదు. యజ్ఞయాగాదులే నాటి ఐహికాముష్మిక సాధనాలు. రామాయణకాలానికి కూడ "దేవతాయతనానిచ" వంటి ప్రయోగాలు కనబడతాయి. బహుశా అవి ఇళ్ళలో ఉండే దైవమందిరాల సూచకాలే కావచ్చనిపిస్తుంది. పురాణాలలో క్షేత్రమహాత్మ్యాలున్నాయి. తీర్థక్షేత్ర సందర్శనల విశేషాలున్నాయి. మొత్తం మీద వేలాది సంవత్సరాలుగా ఆలయవ్యవస్థ కనబడుతోంది.

క్రీస్తుకి ఎడాపెడా మాత్రమే ప్రపంచచరిత్రను సర్దేస్తూ కుదించేసిన పాశ్చాత్యుల చరిత్ర ప్రకారం చూసినా, క్రీస్తు పూర్వం ౨వ శతాబ్దినాటికి ఆలయ నిర్మాణాలు సాగాయి. నాటినుండీ కూడ రాజులు ఆలయాలను సామాజిక ఉత్సవకేంద్రాలుగా, సాంస్కృతిక రంగ వేదికలుగా, సాంఘిక సమానత్వ సాధకాలుగా, సమాజ సంస్కరణా కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ నిర్వహిస్తూ వచ్చారు. అందుకే ఇంచుమించు ప్రతీ రాజవంశీకుడు ఏదో ఒక ఆలయాన్ని నిర్మించినట్లో, వృద్ధి చేసినట్లో మనకు కనబడుతుంది.

నేటిప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థిక సంక్షోభాది సందర్భాలు రాకుండా వినియోగ వస్తూత్పత్తికి అతీతమైన నిర్మాణాలతో ఆర్థిక చలన సామర్థ్య వృద్ధికి కారణమయ్యేలా, అనేకమందికి ఉపాధినిస్తూ ఆలయ నిర్మాణ-నిర్వహణలు జరగటాన్ని మనం గమనించవచ్చు. శిల్పులు-కళాకారులు-కార్మికులు-వ్యాపారులు-పండితులు- పాచకార్చక-పరిచారక-శకటకార-వాహక-వాద్యకారాదులు అనేక మందికి అవి ఉపాధికేంద్రాలు.

సార్వకాలిక-సార్వదేశిక ద్రవ్యవస్తు నిధి నిక్షేప నిలయాలు. రజతస్వర్ణరత్నాభరణ సంరక్షణ కేంద్రాలు. భయభక్తులతో చూచేవారాద్రవ్యాన్ని. అది సమాజాన్ని నిత్యవైభవోపేతంగా నిలిపి ఉంచే ద్రవ్యనిధి. కామన్ ప్రాపర్టి. పన్నులరూపంలో కట్టింది పాలనకుపయోగించేది. అది చెకింగ్ అక్కౌంటు లాటిది. భక్తిప్రపత్తులతో సమర్పించేది శాశ్వతనిధి. ఫిక్సెడ్ డిపాజిట్ లాటిది. అందుకే వేలాది సంవత్సరాలుగా భారతదేశం వైభవోపేతంగా నిలిచివుంది.

అందుకే అనేక దోపిడీదార్లకు లక్ష్యమయ్యిందనేది వేరేసంగతి. ఆలయాల లక్ష్యంగా దండయాత్రలు మనకు తెలుసు. మొత్తం మీద ఆలయాలు శాశ్వత ద్రవ్యకేంద్రాలు.

ఇలా బహుళ ప్రయోజన సాధకాలైన ఆలయాల నిర్మాణ-నిర్వహణలు మారిన కాలానికి అనుగుణంగా, కొంతమేరకు పద్ధతులను మార్చుకోవడం అనివార్యమైంది. ఉద్దేశ్యాలు పలుచన కావటం కూడా సంభవమే అయింది.

మారిన దేశకాల పరిస్థితులనుబట్టి దేశవిదేశాల్లో విస్తరిస్తున్న భారతీయుల అవకాశాలను అవసరాలను బట్టి - అన్ని వ్యవస్థలవలె ఆలయవ్యవస్థ కూడా మార్పు చేర్పులకు లోనవ్వటం సహజమే. అయితే ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా, మౌలిక ఆశయాల ఆధారంగా ఆలయవ్యవస్థను తీర్చిదిద్దుకునే ప్రయత్నం హర్షించ దగినది. ప్రస్తుత ప్రజాస్వామిక ప్రపంచంలో ప్రజలే ఏకమై, తామే ప్రభువులై ఆలయవ్యవస్థను పటిష్ఠ పరుచుకుంటూ సామాజిక సర్వతోముఖ వికాసానికి దోహదకారులయ్యే ప్రయత్నం ప్రశంసించదగ్గది.

శాస్త్రప్రకారంగా మానవనిర్మిత ఆలయాలది నాల్గవస్థానమైనా ఆశయాల సాధనలో మొదటి స్థానంగా పేర్కొనవచ్చు. దేవాలయాల్లో నాలుగు రకాలున్నాయి.

1. స్వయంభావులై వెలసిన దైవములున్నవి (ఉ: తిరుపతి, శ్రీ శైలం మొ)

2. దేవతలచే ప్రతిష్ఠింపబడిన మూర్తులు కలవి (ఉ:అమరావతి, ద్రాక్షారామము, పంచారామము మొ)

3. ఋషులు-మహాపురుషులు ప్రతిష్ఠించినవి- అగస్త్య వ్యాసాది నిర్మితాలేకాక ఆధునికకాలం పీఠాధిపతులచే ప్రతిష్ఠింపబడినవీ ఈ కోవలోకే వస్తాయి.

4. మానవనిర్మిత మందిరాలు- వీధి వీధిన ఉన్న రామమందిరాలీ కోవలోనివి.

సాధారణంగా అన్ని ప్రసిద్ధ ఆలయాల్లోనూ గర్భ గుడి, ముఖమండపం, విమానం, ధ్వజస్తంభం, ప్రాకారం, గోపురం, రథం, వాహనాలు, మూలవిరాట్టులు, ఉత్సవమూర్తులూ ఇలా ఎన్నో భాగాలుంటాయి. వాటివాటి స్థాపత్య విశేషాలు, ఆగమోక్త మహత్త్వాలు ఇప్పుడు వివరించుకోదల్చుకోలేదు. సామాజిక దృక్పథంతో ఆలయవ్యవస్థను స్పృశిస్తూ ఆలయాల్లో పాటించే ఆచారాల్లో సమాజాన్ని సంస్కరించే ఆంతర్యాలను స్థాలీపులాకంగా చూపటమే ఉద్దేశ్యం.

ఉదాహరణకు ప్రసాదాన్ని గ్రహించేటప్పుడు అందరం ఒక్కటే అన్న భావన కల్గుతుంది. అందరికీ ఆ ప్రసాదమే, ఆ దైవప్రసాదమే అందుతోందన్నదే మన భావన. సర్వం జగన్నాథం అనుకుంటూ సమూహంగా తీసికొనే పూరీజగన్నాధుని ప్రసాదాన్ని గుర్తు చేసికోవాలీ సందర్భంలో. తరతమభేదాల్లేకుండా అందరం దర్శించుకునే తిరుపతి వేంకటేశ్వరుడు, అందరం స్పృశించే కాశీవిశ్వేశరుడు, శ్రీ శైలం మల్లన్న ఇవన్నీ మనలోమనకి ఆత్మీయతను సమష్టి భావాన్ని పెంచుతాయి. గుళ్ళల్లో జరిగే ఊరేగింపులు (ఊరు ఏగుట) దేవాలయాలకు వెళ్ళలేని అశక్తులవద్దకు దైవమే వచ్చి దర్శనమిచ్చే ప్రయోజనాన్ని సాధిస్తాయి.

ఆలయంలో భయభక్తులతో పాటించే ఆచార వ్యవహారాలద్వారా అబ్బే క్రమశిక్షణ-సక్రమమైన మన వైయుక్తిక సామాజిక జీవనానికి దోహదకారి అవుతుంది. ఉదా: ఆలయంలో చెప్పులతో తిరగరాదనటం, ఆలయానికి శుచియై శుభ్రంగా వెళ్ళాలనటం, ఆడంబరంగా అలంకరించుకొని ఆలయాలకు వెళ్ళరాదనటం- ఇవన్నీ ఆలయపవిత్రతను కాపాడటానికి, వ్యవస్థపట్ల గౌరవం పెరగటానికి, అహం తగ్గి వినయం పెరగటానికి ఉపకరిస్తాయి.

బొట్టుపెట్టుకొని, సాంప్రదాయకంగా వెళ్ళటం, ఒంటినిండా బట్టను కప్పుకోవటం వంటివి తనకు సంస్కారకారకాలేకాక ఎదుటివారికి ఆరోగ్యకరమైన గౌరవాన్నిచ్చే వ్యవహారాలు. ఖాళీ చేతుల్తో వెళ్ళకూడదనటం త్యాగాన్ని, సమర్పణా భావాన్ని పెంచటానికి, ప్రసాదస్వీకరణ వినయాన్ని పెంచటానికి, తీర్థం ఆరోగ్యాన్ని పెంచటానికి ఉపయోగిస్తాయి. వ్యర్థ ప్రసంగాలు ఏకాగ్రతకు భంగకారకాలేకాక, దైవంనుండి మనల్ని దూరం చేస్తాయి. అహింస-అస్తేయాది

శమదమాది సాధనకవసరమైన శారీరక మానసిక సంసిద్ధతతో ఆలయప్రవేశం చేస్తే అవి సిద్ధిస్తాయి. దానితో మన సౌభాగ్యమేకాక జగత్కల్యాణం సాధ్యమౌతుంది.

వ్యక్తిని సంస్కారవంతునిగా తీర్చిదిద్దేకేంద్రం ఆలయం. వ్యష్టి సంస్కరణ ద్వారా సమిష్టి సంస్కరణ భారతీయ జీవనసిద్ధాంతసారం. ఒక్కొక్క వ్యక్తీ పద్ధతిగా మలచబడితే సమాజం దానంతట అదే ఆరోగ్యకరంగా జీవిస్తుంది. సంస్కారవంతులై నియమబద్ధంగా జీవించే వ్యక్తులు సమాజానికి ఆధారం. మన సమాజంలో ధర్మనిర్వహణకే తప్ప అధికారానుభవానికి చోటులేదు. మనదైన ధర్మాన్ని నిర్వచించుకోవటంలో మన వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంటుంది. ఈదశలోనే మనలోని 'అహం' తొంగిచూస్తూంటుంది. అహం పోయే ఉపాయం "సర్వాధికారి" సందర్శనమే. అల్పులమని తోస్తే అహం తగ్గుతుంది. అప్పుడే స్వధర్మ నిర్వహణ సులువౌతుంది. ధర్మనిర్వహణా సమర్థత పెరగటానికి ఆలయమే ప్రేరణ. దైవమే సహకారి.

పసితనంలో పెద్దలద్వారా పద్ధతులను తెలిసికొన్నా, పెద్దయ్యాక తనని తాను పద్ధతుల్లో ఇముడ్చుకోవాల్సిందే ఎవరైనా. ఇది నిరంతర ప్రక్రియ. దీనికి సహకరించే వ్యవస్థ సామూహిక శ్రద్ధాకేంద్రం- ఆలయం.

ఇంట్లో చేసికొనే ఆధ్యాత్మిక సాధన మనకి కొంత పరిపూర్ణతా సాధనకు సహకరించినా ఆలయాల్లో లభించే ఆధ్యాత్మిక సాధనావకాశాలు మనల్ని మరింత పరిపూర్ణులుగా తీర్చిదిద్దుతాయి.

మనం స్వచ్ఛందంగా ఆలయాలకు వెళతాం. భగవద్దర్శనంలో ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ పెంపొందించుకుంటాం. ఆదర్శమూర్తులైన పెద్దల సందర్శనం - వారి మార్గదర్శనం ప్రత్యక్షోదాహరణలుగా గమనిస్తాం. వారి అడుగుజాడల్లో నడిచే ప్రయత్నం చేస్తాం. వ్యక్తులమైన మనం మనదైన సమాజంలో సమష్టిలో మనమో భాగమని గుర్తించుకొంటూ ఇమిడిపోతాం. సామాజిక అవసరాలను మనవైన శక్తిసామర్థ్యాలతో తీరుస్తూ, మన శక్తిసామర్థ్యాలను మరింత బలోపేతం చేసికొంటాం.

దీనికై మనల్ని మనం భక్తి-భగవత్సేవ-దానం-ధర్మం-పుణ్యం-పురుషార్థం వంటి ప్రక్రియలతో మెరుగులు దిద్దుకుంటాం. ఈ భావజాలానికి, అభ్యాసానికి ఆలవాలం ఆలయం. మొత్తం మీద గుడి సామాజిక సంస్కరణాకేంద్రం. అది మొత్తం సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిబింబిస్తూ ఉంటుంది.

ముఖ్యంగా దేశవిదేశాల్లో ఉన్న ఆలయాలు మొత్తం భారతీయ సమాజం ఒకచోట చేరే వేదికలుగా ఉండటాన్ని మనం గమనించవచ్చు.

## ఆన్ లైన్

*- నారాయణ స్వామి*

నేను యెలా ఉంటానో
నీకు తెలుసా -
నీవు యెలా ఉంటావో
నాకు తెలుసా?

బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ జాలంలో
కనబడీ వినబడని
మాటలదొంతర్లే ఆనవాళ్ళన్నీ .

కొంత ఉద్వేగం కొంత ఆవేశం
కొంత దుఃఖం కొంత ఆనందం
వేలరంగులూ లెక్కలేనన్ని నీడలూ
మానిటర్ స్క్రీన్ మీద మెరిసే
నలుపు తెలుపుల గీతలు .

కళ్ళకింద నల్లని కాంతులు
పెదవులమీద తెల్లని మరకలు
ఆన్లైన్ లో క్షణికాలు.

సడలిన గుండె తీగల్ని సవరించడం
శరీరంపై వయసు పగుళ్ళని
ఆదుర్దాగా తడుముకోవటం
అంతా లిప్తపాటు

గిడసబారిన గోటికొసల సంభాషణలు
స్పృశించలేని గుండె చప్పుళ్ళు
ఇక మనమంతే

నేనెలా ఉంటావో
నీవెలావున్నానో
అంతుపట్టని అరమోడ్పు కళ్ళు